నమస్తే తెలంగాణ
# జనగామ
5 | ఆదివారం 14 జూలై 2024 | JANAGAON





కేయూలోని పోతన హాస్టల్‌లో పెచ్చులూడి బెడ్స్‌పై పడిన శిథిలాలు

- విద్యార్థినులకు తప్పిన ప్రమాదం
- రిజిస్ట్రార్ మల్లారెడ్డిపై మండిపాటు
- సమస్యలపై నిలదీసిన బీఆర్ఎస్వీ కేయూ అధ్యక్షుడు ప్రశాంత్
- సమ్మక్క, సారలమ్మ హాస్టల్ కేటాయింపు

# ఊడిపడిన స్లాబ్ పెచ్చులు..

## కాకతీయ యూనివర్సిటీ పోతన గర్ల్స్ హాస్టల్‌లో ఘటన

హనుమకొండ చౌరస్తా, జూలై 13 : వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీ పోతన గర్ల్స్ హాస్టల్ స్లాబ్ పెచ్చులూడి కుప్పకూలింది. శుక్రవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగిన సమయంలో గదిలో విద్యార్థినులు లేకపోవడంతో వారి ప్రాణాలకు ముప్పువాటిల్లలేదు. దీంతో విద్యార్థినులు పోతన హాస్టల్ ఎదుట రాత్రి నుంచే నిరసనకు దిగారు. విషయం తెలుసుకున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పెరటి మల్లారెడ్డి అక్కడికి చేరుకుని విద్యార్థినులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వారు వినలేదు. పెచ్చులూడిన సమయానికి ఎవ్వరూ లేకపోవడం తమ అదృష్టమని, లేకుంటే ప్రాణహానీ జరిగేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై యూనివర్సిటీ అధికారులను నిలదీశారు. శనివారం ఉదయం కూడా వారు హాస్టల్‌లోకి వెళ్లకుండా భయాందోళనలతో ఆరు బయటనే కూర్చున్నారు.

**రిజిస్ట్రార్‌ను బంధించేందుకు యత్నం..**

హాస్టల్‌లో నిత్యం సమస్యలతో సతమతమవుతున్నామని, దీనిపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పరిష్కరించడంలేదని విద్యార్థులు యూనివర్సిటీ రిజిస్ట్రార్ మల్లారెడ్డిపై మండిపడ్డారు. రిజిస్ట్రార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఒకదశలో మల్లారెడ్డిని బంధించేందుకు యత్నించారు. విద్యార్థుల ఆందోళన నేపథ్యంలో రాణిరుద్రమదేవి హాస్టల్‌ను రిజిస్ట్రార్ మల్లారెడ్డి పరిశీలించారు. ఈ క్రమంలో హాస్టల్‌కు వచ్చిన రిజిస్ట్రార్‌ను విద్యార్థులు అడ్డుకున్నారు. శనివారం తెల్లవారుజాము వరకు విద్యార్థులు ఆందోళన కొనసాగించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మల్లారెడ్డిని బీఆర్ఎస్వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్ సమస్యలపై నిలదీశారు. హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాగా, ఇదే పోతన హాస్టల్‌లో కొద్దిరోజుల క్రితం సీలింగ్ ఫ్యాన్ కిందపడడంతో ఓ విద్యార్థిని తీవ్రంగా గాయపడింది. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.


సమస్యలపై రిజిస్ట్రార్‌ను నిలదీస్తున్న బీఆర్ఎస్వీ కేయూ అధ్యక్షుడు ప్రశాంత్

### సమ్మక్క-సారలమ్మ హాస్టల్ కేటాయింపు

పోతన గర్ల్స్ హాస్టల్ విద్యార్థినులకు నూతనంగా నిర్మించిన సమ్మక్క-సారలమ్మ హాస్టల్‌ను కేటాయించారు. కొత్తగా 200 బెడ్స్ ఆర్డర్ ఇచ్చామని, అవి వచ్చిన తర్వాత షిఫ్ట్ చేద్దామనుకున్న క్రమంలో ఈ ఘటన జరిగిందని రిజిస్ట్రార్ మల్లారెడ్డి తెలిపారు. దీంతో పాత బెడ్స్‌తోనే విద్యార్థినులను నూతన హాస్టల్‌లోకి మారుస్తున్నట్లు పేర్కొన్నారు.


హాస్టల్‌లో పెచ్చులూడి పడడంతో భయాందోళనలో బయట కూర్చున్న విద్యార్థినులు

# బొగత అందాలకు పర్యాటకుల ఫిదా

వాజేడు, జూలై 13 : బొగత జలపాతాన్ని చూసి పర్యాటకులు ఫిదా అవుతున్నారు. శనివారం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. జలపాతం వద్ద ఉన్న స్విమ్మింగ్ పూల్‌లో స్నానాలు చేస్తూ ఎంజాయ్ చేశారు. చుట్టూ ఉన్న పచ్చని చెట్లు వారిని మంత్రముగ్ధులను చేశాయి. జలపాతం వ్యూ పాయింట్ నుంచి బొగత అందాలను చూస్తూ సెల్ఫీలు దిగారు.


స్విమ్మింగ్‌పూల్‌లో పర్యాటకులు



## బోడ కాకర @300

వర్షాకాల సీజన్‌లో దొరికే బోడ కాకర కాయలకు ఫుల్ డిమాండ్ ఉంది. అడవిలో సహజ సిద్ధంగా దొరికే ఈ కాయలను ప్రజలు అమితంగా ఇష్టపడతారు. పేదవాడి నాన్ వెజ్‌గా చెప్పుకునే బోడ కాకర కాయలు ధరలో చికెన్‌ను మించిపోయాయి. శనివారం వాజేడు, వెంకటాపురం మండలాల్లోని మార్కెట్‌లో కేజీ రూ.300కు లభ్యమయ్యాయి.

**కాకతీయ యూనివర్సిటీ పాలకమండలి నియామకం రాజకీయ రంగు పులుముకుంటున్నది. ఉమ్మడి ఖమ్మం, మంచిర్యాల జిల్లాలకు పాలకమండలిలో ప్రాతినిథ్యం కల్పించకపోవడంతో కొత్త చిచ్చు రాజుకుంది. ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయం తీసుకుందని పలువురిలో అసంతృప్తి నెలకొంది. యూనివర్సిటీ పరిధిలో ఉండే తమ ప్రాంతాలను రాష్ట్ర ప్రభుత్వం విస్మరించడం సరికాదని ఆయా జిల్లాల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పాలకమండలిలో మార్పులు చేయాలని కోరుతున్నారు. సవరణలతో మరోసారి ఉత్తర్వులు జారీ చేయించాలని ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన విద్యావేత్తలు, మేధావులు మంత్రులు తుమ్మల, పొంగులేటిపై ఒత్తిడి తెస్తున్నారు. ప్రభుత్వ ముఖ్య సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేసినట్లు సమాచారం.**

*- వరంగల్, జూలై 13 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*




# పాలకమండలిపై రాజకీయ రగడ

- ఉమ్మడి ఖమ్మం జిల్లా వారికి దక్కని ఛాన్స్
- ప్రాతినిథ్యం లేకపోవడంతో అసంతృప్తి
- మంత్రి తుమ్మల, పొంగులేటిపై ఒత్తిడి
- వేం నరేందర్‌రెడ్డికి సైతం ఫిర్యాదులు

## కేయూ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌తో కొత్త చిచ్చు

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తొమ్మిది మందితో కాకతీయ యూనివర్సిటీ పాలక మండలిని నియమించింది. బోధనతోపాటు వ్యవసాయం, పరిశ్రమలు, వాణిజ్యం, విద్య, ప్రజా, న్యాయ, సామాజిక సేవా రంగాలకు చెందిన వారికి ఈ కమిటీలో చోటు కల్పించినట్లు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొన్నది. అయితే ఈ పాలకమండలిలో అవకాశం దక్కినవారిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం రాజకీయ నేతలకు యూనివర్సిటీలో పదవులను కల్పించినట్లుగా చర్చ జరుగుతున్నది. పాలకమండలి నియామకం ఏకపక్షంగా సాగిందని ఉమ్మడి ఖమ్మం, మంచిర్యాల జిల్లాలోని బోధన సిబ్బంది, పలువురు విద్యావేత్తలు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయమై ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఆశావహులు మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. పాలకమండలిలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు అవకాశం కల్పించాలని, అవసరమైతే సవరణలతో మరోసారి ఉత్తర్వులు జారీ చేయాలని కోరినట్లు సమాచారం. ఈ మేరకు వేం నరేందర్‌రెడ్డిపై మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కూడా ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తుంది.

**బోధన సిబ్బంది కొనసాగింపుపై అస్పష్టత**

కాకతీయ యూనివర్సిటీలో నియమితులైన కొందరు బోధన సిబ్బంది కొనసాగింపుపై అస్పష్టత నెలకొంది. ఈ ప్రక్రియకు సంబంధించిన సెలెక్షన్ కమిటీ నియామకాలను ఆమోదించలేదు. న్యాయశాస్త్ర, ఇన్ఫర్మేటిక్స్ విభాగాలకు చెందిన ఇద్దరిని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పాలకమండలి సభ్యులుగా నియమించడం న్యాయపరమైన సమస్యలకు ఆస్కారం ఇచ్చినట్లైందని సీనియర్ ప్రొఫెసర్లు అంటున్నారు. 2010లో వారి నియామక ప్రక్రియను పాలకమండలి ఆమోదించలేదు. వీరిద్దరితోపాటు మరో 26 మంది నియామకాలనూ తప్పుబట్టింది. ఆ తర్వాత వీరి తొలగింపుపై నిర్ణయం తీసుకోవాలని యూనివర్సిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. అప్పటి నుంచి వీరికి ఎలాంటి పదోన్నతులు కల్పించలేదు. 2023లో జువాలజీ విభాగంలో ఇద్దరిని తొలగించి మిగతా వారి వేతనాలను కొన్ని నెలల పాటు చెల్లించలేదు. ఈ ప్రక్రియపై కేయూ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ విషయం అప్పట్లో సంచలనం సృష్టించింది. పాలకమండలి ఆమోదించని వారిని, చర్యల కారణంగా ప్రమోషన్లు పొందని వారిని ఇప్పుడు కాకతీయ యూనివర్సిటీ పాలకమండలిలో సభ్యులుగా నియమించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం వీరి నియామకాల అంశం హైకోర్టులో ఉండగా మండలిలో చోటు దక్కడం వివాదాస్పదంగా మారింది. ఇప్పుడు కొత్త పాలకమండలిలో సభ్యులైన వీరు తమ నియామకాలకు సంబంధించి సెలెక్షన్ కమిటీ సిఫార్సులను ఆమోదించుకోవడంలో మిగిలిన వారిని ప్రభావితం చేస్తారనే చర్చ జరుగుతున్నది. వీరి నియామకాలు, ప్రమోషన్ల నిర్ణయాలు ఏకపక్షంగా తీసుకునే అవకాశం ఉంటుందని పలువురు చర్చించుకుంటున్నారు.

# గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- తాడ్వాయి, గోవిందరావుపేట, కన్నాయిగూడెం, ఏటూరునాగారం మండలాల్లో పర్యటన
- పలు అభివృద్ధి పనులు ప్రారంభం

తాడ్వాయి/ గోవిందరావుపేట/ కన్నాయిగూడెం/ ఏటూరునాగారం, జూలై 13 : గిరిజన గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నదని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. శనివారం ఆమె తాడ్వాయి, గోవిందరావుపేట, కన్నాయిగూడెం, ఏటూరునాగారం మండలాల్లో పర్యటించారు. తాడ్వాయి మండలం పోచారంలో కంటైనర్ సబ్ సెంటర్, గోవిందరావుపేట మండలం చల్వాయిలో రూ.1.35లక్షలతో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ తరగతి గదులు, వసతి భవనం, కన్నాయిగూడెం మండలం ముప్పనపల్లిలో రూ.3.50 కోట్లతో కస్తూర్బా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాల నూతన భవనం, ఏటూరునాగారం మండలంలోని అల్లంవారి ఘనపూర్‌లోని పల్లె దవాఖాన (సబ్ సెంటర్)భవనాన్ని కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీష్, అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి మంత్రి ప్రారంభించారు. తాడ్వాయి మండలం లింగాల గ్రామంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజల నుంచి రోడ్డు, విద్యుత్, వైద్యం,బస్సు. జీసీసీ డిపో, పోడు పట్టాలు తదితర సమస్యలపై వినతులను స్వీకరించారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో మంత్రి సీతక్క మాట్లాడారు. గిరిజన గ్రామాల ప్రజలు వైద్యం అందక ఇబ్బందులు పడుతుండటంతో కంటైనర్ సబ్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం ఉన్న పోడు భూములకు పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వం దృష్టిసారించిందని, కొత్తగా అడవులను నరికి పోడు చేయవద్దని సూచించారు. మీ సేవ కేంద్రాలు, శక్తి క్యాంటిన్ల ఏర్పాటుపై మహిళలకు అవగాహన కల్పించి పోత్సాహం అందిస్తామని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం అందించాలని టీచర్‌ను ఆదేశించారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నదన్నారు. 10వ తరగతి నుంచి కేజీబీవీని అప్‌గ్రేడ్ చేసి ఇంటర్మీడియట్ విద్య అందిస్తున్నట్లు చెప్పారు. అనుమతి లేకుండా విద్యార్థులను బయటకు పంపించొద్దని అధికారులను ఆదేశించారు. చల్వాయి పాఠశాల గ్రౌండ్ లెవలింగ్, బోర్స్ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానన్నా రు. మూడేళ్లుగా కన్నాయిగూడెం కేజీబీవీ విద్యార్థినులు టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించి జిల్లాలో మంచి పేరు సంపాదించారన్నారు. కొత్తగా ఏర్పడిన మారుమూల మండలానికి గుర్తింపు తీసుకొచ్చిన ఉపాధ్యాయులు, విద్యార్థులను మంత్రి అభినందించారు. ఈ ఏడాది 10/10 జీపీఏ సాధించిన విద్యార్థిని కే శివాణిని సీతక్క శాలువాతో సన్మానించారు. అలాగే ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థుల సామర్థ్యం పెంచాలని సూచించారు. కాగా, మంత్రి మాట్లాడుతుండగా కొద్దిసేపు కరెంటు పోయింది. దీంతో 'నాకు ఎందు కు ఇలా జరుగుతుంది' అని విద్యుత్ శాఖ అధికారులపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు. అక్కడే ఉన్న ఏఈ స్వామి వెంటనే ఫోన్ చేసి విద్యుత్ వచ్చేలా చేశారు. కార్యక్రమాల్లో ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య, జీసీడీవో రమాదేవి, గిరిజన సంక్షేమశాఖ ఈఈ వీరభద్రం, తహసీల్దార్లు రవీందర్, సృజన్‌కుమార్, జగదీశ్వర్, ఏటూరునాగారం ఎంపీడీవో రాజ్యలక్ష్మి, చల్వాయి పాఠశాల హెచ్‌ఎం వెంకటలక్ష్మి, వైద్యురాలు సుమలత, ఇతర అధికారులు పాల్గొన్నారు.


గోవిందరావుపేట : చల్వాయిలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క, పక్కన కలెక్టర్ దివాకర, అదనపు కలెక్టర్ శ్రీజ

# మారేడుగొండకు మోక్షమెప్పుడో ?


- చెరువు కట్ట తెగి ఏడాదైనా మొదలు కాని పనులు
- మరమ్మతు చేసి ఆదుకోవాలని రైతుల వేడుకోలు

వెంకటాపూర్, జూలై 13 : ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని భూర్గుపేట మారేడుగొండ చెరువు కట్ట తెగి ఏడాది గడుస్తున్నా మరమ్మతుకు నోచుకోవడంలేదు. గత సంవత్సరం జూలై 26న అర్ధరాత్రి 650 సెంటీ మీటర్ల భారీ వర్షానికి చెరువు నిండి ఆరు చోట్ల గండి పడింది. చెరువు కింద సాగుచేసిన సుమారు 1,200 ఎకరాల వరి పంట, లక్ష్మీదేవిపేట-భూర్గుపేట గ్రామాల మధ్యలో రోడ్డు పూర్తిగా కొట్టుకుపోవడంతో పాటు వెయ్యి ఎకరాల వరి పంట పూర్తిగా దెబ్బతిన్నది. పంట పొలాల్లో భారీగా ఇసుక మేటలు వేసి హద్దులు చెరిగిపోయాయి. గత ప్రభుత్వం తెగిన రోడ్డును తాత్కాలికంగా మరమ్మతు చేసినా ఈసారి భారీ వర్షాలు కురిస్తే మళ్లీ తెగిపోయే పరిస్థితి ఉంది. చెరువు కట్ట మరమ్మతుకు నీటి పారుదల శాఖ గత ఏడాది రూ.7 కోట్లతో చేసిన ప్రతిపాదనలను ఉన్నత స్థాయి అధికారులు పరిశీలించి మరోసారి పంపాలని సూచించారు. దీంతో అధికారులు రూ.4.32 కోట్లతో మళ్లీ పంపారు. అంతలోనే ఎలక్షన్ కోడ్ రావడంతో నిధుల విడుదల కాలేదు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు కావస్తున్నా నిధులు విడుదల చేయడంలేదు. గండ్లను పూడ్చడానికి రూ.1.50 కోట్లు అవసరమవుతాయని నీటి పారుదల శాఖ అధికారులు అంచనా వేశారు. గండ్లను పూడ్చని పక్షంలో చెరువులోకి వచ్చిన నీరంతా నిల్వ ఉండకుండా బయటకు వెళ్లనుంది. దీంతో ఆయకట్టు రైతులు పంటలు సాగుచేసుకునే పరిస్థితి ఉండదు. ఇప్పటికైనా మంత్రి సీతక్క, కలెక్టర్ దివాకర స్పందించి చెరువు కట్ట మరమ్మతుకు నిధులు మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.

### రెండు పంటలకు నష్ట పరిహారం ఇవ్వాలి



తమకు రెండు పంటలకు నష్ట హరిహారం చెల్లించి వెంటనే కట్టను మరమ్మత్తు చేయాలి. గత ఏడాది కట్ట తెగి పంట పొలాలు కొట్టుకుపో యి ఇసుక మేటలు వేసింది. నా ఎకరం భూమి తో పాటు మరో రెండెకరాలు కౌలుకు తీసుకొని నాటు వేశాను. కట్ట తెగడం వల్ల పూర్తిగా నష్టపోయాను. అంతేకాకుండా ఆయకట్టు కింద ఉన్న 1,200 ఎకరాల రైతుల పరిస్థితి ఇలానే ఉంది. సాగు నీరు లేక ఈ సారి పంటలు వేసే పరిస్థితి కనిపించడంలేదు. **- బొడ్డపెల్లి స్వామి, ఆయకట్టు రైతు, నర్సింగాపూర్**



రెండు చోట్ల తెగిపోయిన మారేడుగొండ చెరువు కట్ట




ఎర్రబాబు, సత్యవతిదేవి, నాగరాజు (ఫైల్)

# ఘోర రోడ్డు ప్రమాదం

- ఆటోను కంటైనర్ ఢీకొని ముగ్గురు మృతి
- మృతుల్లో దంపతులు, ఆటో డ్రైవర్
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- ఏటూరునాగారం హైవేపై దుర్ఘటన

ఏటూరునాగారం, జూలై 13 : ములుగు జిల్లా ఏటూరునాగారం-భూపాలపట్నం హైవేపై శనివారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆటోను కంటైనర్ ఢీకొన్న ఘటనలో దంపతులు సహా ముగ్గురు మృతి చెందగా, ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. వాజేడుకు చెందిన కాకర్లపూడి సత్యనారాయణరాజు అలియాస్ ఎర్రబాబు (70), సత్యవతి దేవి (60) దంపతులు. వీరి కుమార్తె అనితను విశాఖపట్నం బస్సు ఎక్కించేందుకు శనివారం రాత్రి తలండి నాగరాజు (35) ఆటోలో ఏటూరునాగారం వస్తున్నారు. ఈ క్రమంలో ఏటూరునాగారం నుంచి వాజేడుకు వెళ్తున్న కంటైనర్ డ్రైవర్ ఎదురుగా వస్తున్న గేదెను తప్పించబోయి ఆటోను ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఆటో నుజ్జు నుజ్జు కాగా, కాకర్లపూడి సత్యనారాయణ రాజు అలియాస్ ఎర్రబాబు, అతడి భార్య సత్యవతి దేవి, ఆటో డ్రైవర్ తలండి నాగరాజు అక్కడికక్కడే మృతి చెందారు. అనితతో పాటు ఆటో డ్రైవర్ నాగరాజుకు తోడుగా వస్తున్న అంజిరెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. మృతుడు సత్యనారాయణ రాజు సీపీఎంలో చురుగ్గా పనిచేశారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న స్థానిక సీఐ శ్రీనివాస్, ఎస్సై తాజుద్దీన్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలు, క్షతగాత్రులను మండల కేంద్రంలోని సామాజిక వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం అంజిరెడ్డి, అనితను వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానకు తీసుకెళ్లారు.

# జాలువారుతున్న ఏడుబావులు

బయ్యారం, జూలై 13 : బయ్యారం, గంగారం మండలాల సరిహద్దు అటవీ ప్రాంతంలో ఉన్న ఏడుబావుల జలపాతం జాలువారుతున్నది. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఏడు బావుల్లో జలధార ప్రారంభమైంది. పచ్చని గుట్టల మధ్య నల్లని రాళ్లపై తెల్లటి ముత్యాలు దొర్లినట్లుగా నీరు ఒక బావి నుంచి కింద ఉన్న మరో బావిలోకి పడుతున్న దృశ్యాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ఈ జలపాతాన్ని చూసేందుకు సందర్శకుల రాక ప్రారంభమైంది.


ఏడు బావుల జలపాతంలో జాలువారుతున్న నీటి ధార